సాక్షి నిజామాబాద్

సోమవారం । 27 । నవంబర్ । 2023



పార్టీ మారిన వారికి..
స్వప్రయోజనాల కోసం పార్టీని వదిలి వెళ్లిన వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం అన్నారు.
- 6లో ▸



మహిళా సంఘాల వైపు..
ఆయా పార్టీల అభ్యర్థులు మహిళా సంఘాల సభ్యుల మద్దతును కూడగట్టేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు.
- 6లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
27.0 /21.2

వాతావరణం
ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు బోధన్‌కు జేపీ నడ్డా రాక

బోధన్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోధన్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డీ మోహన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసేందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సభకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, నాయకులు హాజరు కానున్నారు.

నవీపేట్ రైల్వేగేట్ మూడు రోజులు మూసివేత

ఖలీల్‌వాడి : నవీపేట్ మండల కేంద్రంలోని రైల్వేగేట్‌ను ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మూసివేసినట్లు సీనియర్ రైల్వే సెక్షన్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేగేట్ వద్ద పనులు జరుగుతుండగా గేటు మూసినట్లు చెప్పారు. వాహనాదారులు దీనికి సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు.

అమరవీరుల పార్క్‌లో షబ్బీర్‌అలీ ప్రచారం

- వాకర్స్‌తో ముచ్చట్లు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి షబ్బీర్‌అలీ ఆదివారం వినాయకనగర్‌లోని అమరవీరుల పార్క్‌లో వాకర్స్‌తో ముచ్చటించారు. పార్క్‌లో కలియదిరుగుతూ వాకర్స్‌తో, సీనియర్ సిటిజన్స్‌తో మాట్లాడారు. తాను గెలిస్తే సంక్షేమం, అభివృద్ధి విషయంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ప్రచార కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశ వేణు, రత్నాకర్ ఉన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ



సుభాష్‌నగర్ : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సమక్షంలో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రామిశ్రా, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రికుడికి ఘనస్వాగతం

- 2,800 కి.మీ పాదయాత్ర చేసిన ధాత్రిక రతన్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాశీ నుంచి శబరిమలై, శబరిమలై నుంచి రామేశ్వరం వరకు మొత్తం 2,800 కి.మీ మేర పాదయాత్ర పూర్తి చేసి మళ్లీ కాశీ విశ్వనాధుడి దర్శనం చేసుకుని ఇందూరుకు వచ్చిన.. హరిహర పుత్ర సేవాసమితి అధ్యక్షుడు, గురుస్వామి ధాత్రిక రతన్‌కు నగరంలో అయ్యప్ప ఆలయం వద్ద ఆదివారం ఘన స్వాగతం లభించింది. కాశీ నుంచి మరో నలుగురితో కలిసి పాదయాత్ర మొదలుపెట్టిన ధాత్రిక రతన్ ఇందూరుకు వచ్చాక మరో 26 మందితో కలిసి శబరిమలై వరకు పాదయాత్ర కొనసాగించారు. మళ్లీ అక్కడి నుంచి మరొక భక్తుడిని కలుపుకుని రామేశ్వరం వరకు పాదయాత్ర చేశారు. తిరిగి అక్కడి నుంచి రైలు ద్వారా కాశీ వెళ్లి విశ్వనాధుడి దర్శనం తర్వాత తాజాగా ఇందూరుకు తిరిగి వచ్చారు. రతన్‌కు వీహెచ్‌పీ, హిందూవాహిని, అయ్యప్ప దీక్షాపరులు స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్, హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్ కదంజీ, నగర అధ్యక్షుడు ధాత్రిక రమేష్, సనాతన శ్రీకాంత్, రాంప్రసాద్ ఛటర్జీ, సురేష్‌గౌడ్, గజానన్, బబ్లు, మహేష్, ప్రణయ్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

సమయం లేదు మిత్రమా!

శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు మరో రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారానికి కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండడంతో అభ్యర్థులు మరింత హడావుడి పడుతున్నారు.

- రేపు సాయంత్రం 5 గంటలకు ప్రచారం సమాప్తం
- అభ్యర్థుల హైరానా
- స్టార్ క్యాంపెయినర్లు, ర్యాలీలతో హోరెత్తిస్తున్న ప్రధాన పార్టీలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రేపు సాయంత్రం 5 గంటలకు ప్రచారం సమాప్తం కానుండడంతో భారీ ర్యాలీలతో ప్రధాన పార్టీలు హోరెత్తిస్తున్నాయి. స్టార్ క్యాంపెయినర్లతో అభ్యర్థులు గట్టి ప్రచారం చేయించుకుంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో జాతీయస్థాయి నేతలు పలుసార్లు రావడం గమనార్హం. బీజేపీ అగ్రనేతలు పీఎం మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డాలు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఉమ్మడి జిల్లాలో మూడు సార్లు ప్రచారానికి రావడం విశేషం. సీఎం కేసీఆర్ సైతం అన్ని నియోజకవర్గాల్లో సభలు పూర్తి చేశారు. దీన్ని బట్టి జిల్లాలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోరు ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. ఇప్పటికే ప్రచారం తారాస్థాయిలో నడుస్తోంది. ఇక ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంతో పాటు కులసంఘాలతో పలుసార్లు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ వచ్చారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటి ప్రచారం సైతం నిర్వహిస్తూ వచ్చారు. మరోవైపు సోషల్ మీడియా ద్వారా భారీ ప్రచారం నిర్వహిస్తూ వచ్చారు. సోషల్ మీడియా ప్రచారం నేపథ్యంలో ఎక్కడ చూసినా సీనియర్ సిటిజన్ల నుంచి ప్రతిఒక్కరూ ఎవరి విశ్లేషణ వారు చేస్తున్నారు. దీంతో ఓటరు నాడి అంతుపట్టని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పార్టీలు సోషల్ ఇంజినీరింగ్ పకడ్బందీగా చేస్తూ వస్తున్నారు.

సవాళ్లు.. ప్రతి సవాళ్లు..
జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు ఇందూరు గడ్డ మీద నుంచి సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. మరోవైపు జిల్లాలోని నియోజకవర్గాల అభ్యర్థులు సైతం సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటూ వచ్చారు. ఒకరిద్దరు నేతలైతే పరుష పదజాలం సైతం ఉపయోగించడంతో రాజకీయ వాతావరణం మరింత వాడివేడిగా తయారైంది. ప్రచార పర్వం ముగియనున్న నేపథ్యంలో అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్ మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సమయం తరిగిపోతుండడంతో అభ్యర్థులు, నాయకులు ప్రతి నిమిషాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

ఆకాంక్షలు నెరవేరుస్తాం

- రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించండి
- కామారెడ్డి విజయభేరి సభలో రాహుల్ గాంధీ
- సభ సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్



మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న 'ప్రజల తెలంగాణ' కలను నిజం చేయడానికి కామారెడ్డి ప్రజలు రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన విజయభేరి సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడం ద్వారా తెలంగాణ ప్రజల కలలను సాకారం చేసుకుందామన్నారు. మోదీకి వ్యతిరేకంగా పోరాడితే తనపై 24 కేసులు పెట్టారని, లోక్‌సభ సభ్యత్వం రద్దు చేసి, తన ఇంటిని లాగేసుకున్నారన్నారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో సీఎం కేసీఆర్ కుటుంబం అవినీతిపై ఫోకస్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పేపర్ లీకేజీల వరకు బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎంల మధ్యనున్న అనుబంధం తదితర అంశాలపై మాట్లాడారు. కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ అన్నారు. సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, అర్బన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి అభ్యర్థులు షబ్బీర్‌అలీ, ఏనుగు రవీందర్ రెడ్డి, మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థులు రవీందర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, షబ్బీర్ అలీ

తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష

- బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే..
- ఉద్యమ సమయంలో కాంగ్రెస్ అరాచకాలను ఎవరూ మరిచిపోలేదు
- ఎమ్మెల్సీ కవిత



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఎడపల్లి/బోధన్ టౌన్/నవీపేట : బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటే అనే ప్రచారం అవాస్తవమని, బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ఆదివారం ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్, బోధన్ పట్టణంలోని పలువార్డుల్లో, నవీపేట్ మండలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాహుల్‌గాంధీ రాష్ట్ర పర్యటనకు వచ్చి వెళ్తూ హైదరాబాద్ బిర్యానీ, పాన్ తిని వెళ్తారని, ఆయనకు ఇక్కడ మర్యాద అంతేనన్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటయ్యాయని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన బీఆర్‌ఎస్ విజయం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలోని ప్రతిఒక్క అంశాన్ని అమలు చేసితీరుతామన్నారు. తెలంగాణ కావాలన్న ఉద్యమకారులపై కాంగ్రెస్ తూటాల వర్షం కురిపించిన రోజులు మరువలేదన్నారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. బీడీ కార్మికులకు ఆంక్షల్లేకుండా జీవనభృతి అందిస్తామన్నారు. తెలంగాణకు శ్రీరామరక్ష కేసీఆర్ అని, వినూత్న పథకాలతో దేశంలోనే బీఆర్‌ఎస్ సర్కారు ఆదర్శంగా నిలుస్తోందని షకీల్ పేర్కొన్నారు. మైనారిటీల కోసం పాటుపడిన ఏకైక సర్కారు బీఆర్‌ఎస్ సర్కారన్నారు. వీరితోపాటు పూజారులకు, చర్చి ఫాదర్‌లకు సైతం వేతనాలను అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు తప్పవన్నారు. కాంగ్రెస్ వస్తే సంక్షేమ పథకాలు అన్ని బందవుతాయని, అందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్, నర్సింగ్‌రావ్, తెడ్డు పోశెట్టి, అబ్బన్న, ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఇమ్రాన్ ఖాన్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మానిక్ రజిత యాదవ్, జాన్కంపేట్ ఎంపీటీసీ మంద సంజీవ్ తదితరులున్నారు.

పాతబస్తీని మినీ పాకిస్తాన్ చేశారు

- బీఆర్‌ఎస్ స్టీరింగ్ ఓవైసీల చేతుల్లోనే..
- కేసీఆర్ పెద్ద మోసగాడు
- హామీలు అమలు కాక ప్రజలు నమ్మట్లేదు
- నిజామాబాద్‌లో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రోడ్ షో..
- నగరంలో భారీ బైక్ ర్యాలీ



ర్యాలీలో రాజాసింగ్, ధన్‌పాల్ సూర్యనారాయణ



నగరంలోని గోల్‌హన్మాన్ వద్ద కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

సుభాష్‌నగర్ : హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో ఓవైసీలు టెర్రరిస్టులను పెంచి పోషిస్తూ పాతబస్తీని మినీ పాకిస్థాన్‌గా మార్చారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిజామాబాద్ అర్బన్ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తరఫున రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు దుబ్బ చౌరస్తా నుంచి గంజ్ కమాన్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, దేవీరోడ్, పూసలగల్లి మీదుగా గోల్ హనుమాన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గోల్ హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ అర్బన్‌లో సూర్యనారాయణను గెలిపించుకుంటే కేంద్రం, రాష్ట్రం నుంచి కొట్లాడి నిధులు తీసుకొస్తాడని తెలిపారు. గణేశ్ గుప్తా కమీషన్లు తీసుకుంటాడని ఆరోపించారు. దేశంలో ఉగ్ర కార్యకలాపాలు ఎక్కడ జరిగినా వాటి మూలాలు, అరెస్టులు హైదరాబాద్‌లోనే జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పడినా హైదరాబాద్‌లో అల్లర్లు కాకుండా ఓవైసీ కాళ్లు పట్టుకుంటున్నారని, వాళ్లని అడుక్కునే అవసరమేముందని ప్రశ్నించారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి ఎన్‌ఐఏ అధికారులు వచ్చి ఆరుగురు టెర్రరిస్టు లను పట్టుకున్నారని, అందులో ఒకరు ఓవైసీకి చెందిన కళాశాల ప్రొఫెసర్ అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఒక టెర్రరిస్టు ఏం పాఠాలు చెబుతాడని, కేవ లం టెర్రరిజం నూరిపోస్తున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉగ్రవాదులకు మద్దతు తెలిపితే బుల్డోజర్లు వస్తాయన్నారు. హైదరాబాద్ తర్వాత ఎంఐఎం లక్ష్యం నిజామాబాద్ అని, ఇందూరు ప్రజలు ఆలోచించి ఓటేయాలన్నారు. కారు పార్టీ స్టీరింగ్ ఓవైసీ చేతిలో ఉందన్నారు. బీఆర్‌ఎస్‌ను కాస్త బార్ అండ్ రెస్టారెంట్ సమితి (బీఆర్‌ఎస్)గా మార్చారన్నారు. మైనారిటీ మహిళల ఆత్మగౌరవం కోసం పీఎం నరేంద్రమోదీ ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేయించారన్నారు.

నేను గెలిస్తే హిందువులు గెలిచినట్లే..
అర్బన్‌లో తాను గెలిస్తే హిందువులందరూ గెలిచినట్లేనని బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్య నారాయణ పేర్కొన్నారు. ఓవైసీ 15 నిమిషాలు సమయమిస్తే హిందువులు లేకుండా చేస్తానని గతంలో ప్రసంగించారని గుర్తుచేశారు. దమ్ముంటే అర్బన్‌లో బీఆర్‌ఎస్ తరఫున ప్రచారం చేయాలని సవాల్ విసిరానని, భయపడి రాలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీకి హిందూ వ్యతిరేక శక్తులతో సత్సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక వర్గం కోసం పని చేస్తున్నాయన్నారు.

నగరాభివృద్ధి ఎక్కడ..?
సీఎం కేసీఆర్ పెద్ద మోసగాడని, 2014లో దళితుడిని సీఎం చేస్తానని చెప్పి చేయలేదన్నారు. గణేశ్ గుప్తా అర్బన్‌ను రూ.1500 కోట్లతో అభివృద్ధి చేశానని చెప్తున్నాడని, ఎక్కడ ఖర్చు పెట్టావో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత లిక్కర్ స్కాంలో ఇరుక్కుందన్నారు. బీసీని సీఎం చేస్తానని ప్రకటించిందని బీజేపీ మాట నిలబెట్టుకుంటుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, జిల్లా ఇన్‌ఛార్జి కళ్లెం బాల్‌రెడ్డి, నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, పంచరెడ్డి లింగం, వనిత, నాగోళ్ల లక్ష్మీనారాయణ, శివప్రసాద్ తదితరులున్నారు.

కనులవిందుగా రథోత్సవం



భీమ్‌గల్ మండలంలో లింబాద్రి గుట్టపై ఆదివారం లక్ష్మీ నృసింహుడి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేలమంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య నంబి వంశస్తులు, వేద పండితులు ఘనంగా రథోత్సవాన్ని నిర్వహించారు. పుష్పాలంకృతమైన రథంపై ఉత్సవ మూర్తిని ఊరేగించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి దర్శించుకున్నారు. - భీమ్‌గల్

కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన

సుభాష్‌నగర్ : శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లు, వసతులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అన్నిచోట్ల విద్యుత్ వసతి, ఫ్యాన్లు, లైట్లు పని చేసేలా నిర్ధారణ చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ రాజశేఖర్‌ను ఆదేశించారు. జెనరేటర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత చేపట్టే కౌంటింగ్ సాఫీగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, అధికారులు ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ, అదనపుకలెక్టర్లు

మూడోసారీ విజయం నాదే..

రెండుమార్లు బాల్కొండ నియోజకవర్గం ప్రజలు చూపిన ఆదరణతో, సీఎం కేసీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యంతో రూ.వేల కోట్ల నిధులు బాల్కొండ నియోజకవర్గం అభివృద్ధికి తెచ్చాను. ఆ అభివృద్ధి పనులే నా హ్యాట్రిక్ విజయానికి బాటలు వేస్తాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి, బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. సాధారణ ఎన్నికల్లో మూడోసారి ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆయనతో 'సాక్షి' ఇంటర్వ్యూ.

– మోర్తాద్(బాల్కొండ)

- రెండుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా
- సీఎం కేసీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యంతో రూ. వేల కోట్లు నిధులు తెచ్చా
- మూడోసారి కూడా భారీ మెజార్టీతో విజయం ఖాయం
- మంత్రి, బాల్కొండ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి



☛ బాల్కొండ నియోజకవర్గంలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటి..?

■ తెలంగాణ ఆవిర్భావానికి ముందు నియోజకవర్గంలో ఎలాంటి పరిస్థితి ఉంది. ఇప్పుడు ఏ విధమైన మార్పు వచ్చిందో ప్రజలకు స్పష్టంగా తెలుసు. నియోజకవర్గంలో సాగునీటి కష్టాలు లేకుండా పెద్దవాగు, కప్పలవాగులో చెక్‌డ్యాంలను నిర్మించాం. తద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెంది సాగునీటి కష్టాలు లేకుండా పోయాయి. చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం రెండో దశ పనులు మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే పూర్తయ్యాయి. చెరువులు, కుంటల్లో పూడిక తీయించి వర్షం నీరు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. రైతులకు సాగునీటి కష్టాలు, విద్యుత్ కష్టాలు అంటూ ఏమి లేకుండా చేశాం. వ్యవసాయ పంపుసెట్లు ఎక్కువగా ఉన్న చోట గ్రామానికి ఒక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేశాం.

☛ మళ్లీ గెలిస్తే ఏం చేయాలనుకుంటున్నారు..?

■ నియోజకవర్గం ప్రజలకు వారు ఆశించినదానికంటే ఎక్కువ చేశాం. మూడోసారి ఎన్నికైతే వారి జీవన ప్రమాణాలు అభివృద్ధి చెందేలా చేస్తాం. ఎవరికైనా పింఛన్లు రాకపోయినా, ఇంకా ఏదైనా సంక్షేమ పథకాలు అందకపోయినా వాటిని పక్కాగా ఇప్పించి ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తాం.

☛ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, మంత్రిగా ఎలాంటి అనుభూతి పొందారు?

■ బాల్కొండ ప్రజలకు కృతజ్ఞతలు. వారు ఆదరించడం వల్ల అసెంబ్లీలో అడుగుపెట్టాను. నా పనితనం మెచ్చి సీఎం కేసీఆర్ మొదటిసారి ఎమ్మెల్యేగా ఎంపికైన నాకు మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా పెద్ద బాధ్యతలను అప్పగించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి నీరందించే పథకం బాధ్యతలను నెరవేర్చినందుకు ఎంతో తృప్తిగా ఉంది. రెండోసారి ఎమ్మెల్యేగా ఎంపిక కాగానే రోడ్లు, భవనాలు, అసెంబ్లీ వ్యవహారాలు, గృహనిర్మాణ శాఖలతో మంత్రిని చేశారు.

☛ ఇంకా చేయాల్సిన పనులు ఏమైనా ఉన్నాయా?

■ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చేయాల్సిన పనులు లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేశాం. 2018 ముందస్తు ఎన్నికల్లో హామీ ఇవ్వని పనులు కూడా సీఎం కేసీఆర్ ప్రోత్సాహంతో పూర్తి చేశాం. ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చేశాం. వారు ఆశించిన దానికంటే మరెన్నో పనులు పూర్తి చేసి సమస్యలే లేని నియోజకవర్గంగా బాల్కొండను తీర్చిదిద్దాం.

రెండు పర్యాయాలు ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన సీఎంకు, అందుకు ఆదరించిన బాల్కొండ ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

☛ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి?

■ నాకు గెలుపుపై పూర్తి ధీమా ఉంది. ఎందుకంటే ఏ నియోజకవర్గంలో జరుగని అభివృద్ధి బాల్కొండ నియోజకవర్గంలో చేసి చూపించాం. గెలుపు విషయంలో బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు. మెజార్టీ పెంచుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో 32 వేల మెజార్టీ లభించింది. ఈసారి చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలతో మరింత మెజార్టీ వస్తుందనే నమ్మకం ఉంది. బాల్కొండ ప్రజల ఆశీర్వాదంతో తప్పక మూడోసారి విజయం మాదే.

క్లుప్తంగా

జాతరకు ముస్తాబైన కేదారేశ్వర ఆశ్రమం



నందిపేట్: మండల సమీపంలోని కేదారేశ్వర ఆశ్రమం కార్తీక పౌర్ణమి సందర్భంగా జాతరకు ముస్తాబయింది. ఏర్పాట్లను ఆశ్రమ కమిటీ సభ్యులు పూర్తి చేశారు. 35 ఏళ్లుగా దసరా రోజున ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ దీక్ష బూని కార్తీక పౌర్ణమి రోజున దీక్ష విరమించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడు దసరా రోజున దీక్షలోకి వెళ్లిన మహరాజ్ దీక్ష ముగింపును ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు విరమించారు. సోమవారం ఆశ్రమంలో జాతర, భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

నేహాకు ఘన స్వాగతం



మోపాల్: మండలంలోని మంచిప్పకు చెందిన ఎస్కే నేహా అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో రజత పతకం సాధించి స్వగ్రామానికి రావడంతో ఆదివారం రాత్రి ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. నేహా ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు రష్యాలో నిర్వహించిన అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూరి సిద్ధార్థ మాట్లాడుతూ.. మారుమూల గ్రామానికి చెందిన నేహా అంతర్జాతీయ స్థాయిలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నేహాను అభినందించారు. అదేవిధంగా నేహా కోచ్ అదే గ్రామానికి చెందిన దేవేందర్ కావడంతో ఆయనను కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నవీన్, కో ఆప్షన్ అజీమ్, ఉపసర్పంచ్ జగదీశ్, సాయిరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.


కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



సుభాష్‌నగర్: సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆదివారం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్లను డిసెంబర్ 3న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా, బాలుర పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్కించనున్నారు. కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం ఖరారు చేశారు. ఎంపికైన సిబ్బందికి సోమవారం శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి కౌంటింగ్ విధులపై పూర్తి అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెండోవిడత ర్యాండమైజేషన్ పూర్తయ్యాక ఆ జాబితా ఆధారంగా జిల్లాలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ శాసనసభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని కేటాయిస్తామన్నారు. ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని ఓట్లను రౌండ్ల వారీగా లెక్కించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఆదేశానుసారం 25 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతూ మొత్తం 412 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వీరిలో 143 మంది సూపర్‌వైజర్లు, 143 మంది అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, 126 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, సీపీఓ బాబూరావు, అధికారులు పాల్గొన్నారు.

లక్కంపల్లి సెజ్, లెదర్ పార్క్‌లతో.. ఉపాధి అవకాశాలు కల్పిస్తా

- నియోజకవర్గంలో శాంతియుత వాతావరణం ఉండేలా చూస్తా
- మల్టీప్లెక్స్ విద్యుత్, లీజు బకాయిలు రికవరీ చేయిస్తా
- స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత కల్పిస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆర్మూర్ నియోజకవర్గంలోని యువతకు స్థానికంగానే మంచి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు లక్కంపల్లి సెజ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో పాటు ఇతర పరిశ్రమలను తీసుకొస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చూస్తానన్నారు. ఆదివారం 'సాక్షి' ఇంటర్వ్యూలో వినయ్‌రెడ్డి పలు అంశాలపై మాట్లాడారు.

ప్రచారంలో ప్రజల స్పందన ఎలా ఉంది?

బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రచారానికి వెళ్తే ఘనంగా స్వాగతిస్తున్నారు. నన్ను గెలిపించేందుకు యువకులు, మహిళలు ప్రచారానికి స్వచ్ఛందంగా తరలివస్తున్నారు.

మీ దృష్టికి వచ్చిన సమస్యలు..?

నియోజకవర్గంలో ఇప్పటివరకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా కట్టించి ఇవ్వలేదు. ధరణి పోర్టల్ ద్వారా భూసంబంధ సమస్యలు ఎదుర్కొంటున్నవారు తమ ఇబ్బందులను చెబుతున్నారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు తాము అనుభవించిన వేదన గురించి వాపోతున్నారు. దళితబంధు, బీసీ బంధు పథకాల్లో బీఆర్‌ఎస్ నాయకులు 30 నుంచి 40 శాతం కమీషన్లు తీసుకున్న విషయం గురించి ప్రస్తావిస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకుల భూకబ్జాలు, అసైన్డ్ భూముల ఆక్రమణలు, ఇతర అరాచకాలపై చెబుతున్నారు. ఇక్కడి నాయకుడి పర్సంటేజీలు, కమీషన్ల కారణంగా లక్కంపల్లి సెజ్‌లోకి యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినవాళ్లు వెనక్కు వెళుతున్నారు. ఇక మట్టి, మొరం, భూదందా గురించి కథలుగా చెబుతున్నారు.

మీరిచ్చే హామీలు?

యువతకు ఉపాధి కల్పించేందుకు గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లక్కంపల్లి సెజ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తా. లెదర్ పార్క్‌ను సైతం ఉద్యోగాలు కల్పించేలా అభివృద్ధి చేస్తా.

ఇక కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల ద్వారా అర్హులకు పథకాలు అందేలా చూస్తా. నందిపేటకు ఆర్టీసీ బస్ డిపో మంజూరు చేయిస్తా. మరోవైపు ఆర్మూర్ ఆర్టీసీ స్థలంలో మల్టీప్లెక్స్ బకాయిలు రూ.7.77కోట్లు, దీని విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.2.10కోట్లు రికవరీ చేయిస్తా. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటా. స్థానిక ప్రజాప్రతినిధులకు మరింత ప్రాధాన్యత కల్పిస్తా.

పార్టీ మారిన వారికి బుద్ధి చెప్పాలి

- బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సిద్ధాపూర్‌లో మాట్లాడుతున్న పోచారం

వర్ని: ఎన్నికల సమయంలో తనకు ద్రోహం చేసి పార్టీ మారిన వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధాపూర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. హనుమాజీపేట్, సిద్ధాపూర్ సర్పంచులు తమ స్వప్రయోజనాల కోసం పార్టీ మారారని వారికి ఓటర్లు గుణపాఠం చెప్పాలన్నారు. రూ. కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసినా విశ్వాసం చూపకుండా పార్టీ మారారని ఆవేదన వ్యక్తం చేశారు. భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. పార్టీ మారిన సర్పంచులు, నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పి కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్ రాకుండా చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం పాటుపడని కాంగ్రెస్, బీజేపీలకు ఎందుకు ఆకర్షితులు అవుతున్నారని ప్రశ్నించారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధాపూర్ రిజర్వాయర్, చందూరు, జాకోరా లిఫ్ట్ ఇరిగేషన్లను మంజూరు చేయించి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి భూములతో పాటు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. సభలో జెడ్పీటీసీ హరిదాసు, సిద్ధాపూర్ మాజీ సర్పంచ్ భారతీ నాయక్, నాయకులు వీర్రాజు, కిషన్, గోపాల్, గిరి, బాల్ సింగ్ పాల్గొన్నారు.

ప్రతి వస్తువులోనూ భగవత్‌తత్వం



యాగం నిర్వహిస్తున్న అర్చకులు

నిజామాబాద్ సిటీ: ప్రతి వస్తువులో భగవత్‌తత్వం ఉంటుందని శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న రామాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి పవిత్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శ్రీ సుదర్శన శతక హవనం నిర్వహించారు. సుదర్శన భగవనుడు ఏ అవతారంలోనైనా ఉంటూ సంకల్పాన్ని నెరవేరుస్తాడని పేర్కొన్నారు. ఈ లోకంలో ఉన్న సమస్త వస్తు జాతం భగవంతుడికి చెందినవే అన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సరళామహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ శోభా, కోశాధికారి ఎస్ శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు పి శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గోదాదేవి, సాయిలు, ఉర్మిళ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న సత్యనాథ్‌రెడ్డి

మోపాల్/డిచ్‌పల్లి: రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నిజామాబాద్ బీసీ వెల్ఫేర్ క్రీడాకారులను నగరంలోని పాఠశాలలో గురుకులాల ఆర్‌సీఓ సత్యనాథ్‌రెడ్డి ఆదివారం సన్మానించి అభినందించారు. ఇటీవల తుర్కపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నిజామాబాద్ జట్టు మార్చ్‌ఫాస్ట్‌లో మొదటిస్థానం, ఖోఖో, వాలీబాల్‌లో ద్వితీయస్థానం, హైజంప్, 3కే పరుగు పందెంలో పతకాలు సాధించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రవికుమార్, అరుణ, పీడీ హన్మంత్‌రెడ్డి, పీఈటీలు వినోద్, నరేశ్, శ్రీకాంత్, నవీన్, పండరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ పాదయాత్ర



నిజామాబాద్ సిటీ: మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమం బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ కందకుర్తికి సోమవారం ద్వితీయ పాదయాత్ర చేపట్టనున్నారు. మహరాజ్ ఈ నెల 6న కార్తీక మాస దీక్షలోకి వెళ్లి గత ఆదివారం రాత్రి 12.05లకు దీక్ష విరమించి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు గుట్టపై 11,116 జ్యోతులు వెలిగించారు. సోమవారం ఉదయం 5.15 గంటలకు మల్లారం గుట్ట నుంచి రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమం వరకు ద్వితీయ పాదయాత్ర చేయనున్నారు. పాదయాత్ర ఆశ్రమం నుంచి మొదలై మల్కాపూర్, కొత్తపేట్ కెనాల్, ముత్తకుంట, కుర్నపల్లి, మంగళ్‌పాడ్, ఎడపల్లి, సాటాపూర్‌గేట్, నీలా, కందకుర్తి త్రివేణి సంగమం వరకు కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం త్రివేణి సంగమ తీరంలో లింగాభిషేకం, సామూహిక గంగాహారతి, మహా అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1987–88లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు హన్మాండ్లు, తులసీదాస్, శ్యాం సుందర్, మారుతీరావు, పూర్వ విద్యార్థులు గుడికొండ సుభాష్, భూతిపిల్లి పీరయ్య, రాజగోపాల్‌చారి, భాస్కర్, శ్రీధర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

పథకాల అమలుకు బాండ్‌పేపర్

భీమ్‌గల్ : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను బాల్కొండ నియోజకవర్గంలో ఖచ్చితంగా అమలు చేస్తానని, అందుకు ప్రజలకు గ్యారంటీగా బాండ్ పేపర్ రాసిస్తానని బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి పేర్కొన్నారు. లింబాద్రి గుట్టపై సోమవారం ఉదయం 10 గంటలకు బాండ్ పేపర్‌పై సంతకం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

మహిళా సంఘాల వైపు.. అభ్యర్థుల చూపు

- పోలింగ్ సమీపిస్తుండడంతో మద్దతు కూడగట్టేందుకు..
- ప్రధాన పార్టీల వ్యూహాలు
- ఆరు నియోజకవర్గాల్లో 28,775 మహిళా సంఘాలు
- 3 లక్షల మంది సభ్యులు



ఖలీల్‌వాడి: ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా పార్టీల అభ్యర్థులు ముఖ్య నాయకులతో ప్రచారం చేపడుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పగలంతా ప్రజలను నేరుగా కలిసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నా.. రాత్రుల్లో లోపాయికారి వ్యూహాలు అనుసరిస్తున్నారు. కుల, యువజన సంఘాలతో పాటు అత్యధికంగా సభ్యులున్నా మహిళా సంఘాల మద్దతు కూడగట్టేందుకు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మహిళా ఓట్లు కీలకంగా ఉండటంతో మహిళా సంఘాలపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల అభ్యర్థులు దృష్టి సారించారు.

అడిగిన హామీలు ఇస్తూ..

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలైన నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడలో 28,775 మహిళా సంఘాలు ఉన్నాయి. ఇందులో మహిళా సంఘాల సభ్యులు 3 లక్షల 99 మంది ఉన్నారు. ప్రధానంగా ఓటు బ్యాంకుగా భావించే మహిళా సంఘాల వైపు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులు దృష్టి సారిస్తున్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఇచ్చే సలహాలు, సూచనల మేరకు అభ్యర్థులు తమకు సపోర్టు ఇచ్చే మహిళా సంఘాల వైపు మొగ్గుచూపుతున్నారు. పార్టీకి చెందిన ప్రతినిధులు మహిళా సంఘాల సభ్యులే కాకుండా తమ బంధువులు, కుటుంబసభ్యుల ఓట్లు పడేందుకు కూడా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఓట్లు గంప గుత్తగా పడితే మహిళా సంఘాల సభ్యులకు ఏంఅడిగితే అవి ఇవ్వడానికి అభ్యర్థి తరఫున వారు సిద్ధమవుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, గ్రామాల్లో మహిళా సంఘాలను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

మహిళా ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	మహిళా ఓటర్లు
ఆర్మూర్	1,11,937
బాల్కొండ	1,19,056
బోధన్	1,14,490
బాన్సువాడ	1,01,795
నిజామాబాద్ అర్బన్	1,51,589
నిజామాబాద్ రూరల్	1,34,601

సంఘాల సభ్యుల వివరాలు

నియోజకవర్గం	సంఘాలు	సభ్యులు
ఆర్మూర్	3662	39,183
బాల్కొండ	6024	63,929
బాన్సువాడ	2736	28,292
బోధన్	4668	48,539
నిజామాబాద్ అర్బన్	5000	50,000
నిజామాబాద్ రూరల్	6685	70,156

ఓటుకు వారు దూరమే..

- ఓటు హక్కుకు నోచుకోని ప్రవాసులు
- జిల్లా నుంచి గల్ఫ్‌కు వెళ్లిన వారు 2.90లక్షలపై మాటే

మోర్తాడ్: ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన ప్రవాసులకు ఓటు హక్కు వినియోగించుకునే వీలు లేకుండా పోతోంది. వయోవృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ సిబ్బందికి, దేశ భద్రతను కాపాడుతున్న సైనికులకు సర్వీస్ ఓటింగ్ విధానం అమలు చేస్తున్న ఎన్నికల కమిషన్ ప్రవాసుల విషయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేకపోయింది. ఫలితంగా జిల్లాలో దాదాపు 2.90 లక్షల మంది గల్ఫ్ వలస కార్మికులతో పాటు ఇతర దేశాల్లో ఉంటున్న వారు ఓటు హక్కుకు దూరమవుతున్నారు. విదేశాల్లో ఆన్‌లైన్ ఓటింగ్ విధానం అమలులో ఉంది. పోలింగ్ బూత్‌కు స్వయంగా వెళ్లి ఓటు వేయని వారు ఆన్‌లైన్‌లో ఓటింగ్‌కు పాల్గొనడానికి దరఖాస్తు చేసుకుంటే ఆయా దేశాల్లో ఓటింగ్ సౌకర్యం కల్పిస్తోంది. మన దేశంలో వలస కార్మికుల కోసం ప్రాక్సీ ఓటింగ్ విధానం అమలు చేయడానికి గతంలో కసరత్తు చేశారు. సాంకేతిక కారణాలతో ఈ విధానం అమలులోకి రాకముందే స్వస్తి పలికారు. ప్రాక్సీ ఓటింగ్ విధానం అమలులోకి వచ్చి ఉంటే గల్ఫ్ దేశాల్లో ఉన్న వలస కార్మికులతో పాటు ఇతర దేశాల్లో ఉపాధి పొందుతున్న ప్రవాసులకు ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలు ఉండేది. కనీసం రానున్న స్థానిక సంస్థల, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనైనా వలస కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునే వీలు కల్పించేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వలస ఓట్లను గుర్తించాలి



వలస కార్మికుల ఓట్లను ఎన్నికల కమిషన్ గుర్తించాలి. కొంత మంది ఓట్లు తొలగించినా అనేక మంది ఓట్లు అలాగే ఉన్నాయి. వలస కార్మికులు ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి. అలా జరిగితేనే సమస్యలు పరిష్కారం అవుతాయి.

– తోట రమేశ్, బాబాపూర్

ఎన్నికల కమిషన్ స్పందించాలి



ప్రవాసుల ఓటు హక్కు వినియోగంపై ఎన్నికల కమిషన్ స్పందించాలి. ప్రవాసులు తమ ఓటు హక్కును ఏదో విధంగా వినియోగించుకుంటే రాజకీయ పార్టీలు ప్రవాసుల కోసం ఏదో ఒక పథకం అమలు చేస్తాయి. ప్రవాసుల హక్కులను కాలరాయద్దు.

– మంద భీంరెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాచారెడ్డి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఘన్‌పూర్ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గజసింగవరం గ్రామానికి చెందిన పంతం సుమన్(35) సొంత పనినిమిత్తం మాచారెడ్డికి వచ్చాడు. తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా ఘన్‌పూర్ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ శివారులో రెండు ట్రాన్స్ ఫార్మర్లలను దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేసి కాపర్‌వైర్లు, ఆయిల్‌ను చోరీ చేశారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంతో సుమారు. రూ. లక్ష నష్టం కలిగినట్లు బాధిత రైతులు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్‌కు చెందిన శాదుల్ (20) గ్రామ శివారు గుట్టలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై మురళి ఆదివారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన శాదుల్ కట్టెలు తీసుకురావడానికి సమీపంలోని గుట్టకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. కుటుంబ సభ్యులు ఆదివారం గుట్టపై పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి ముఖానికి గాయాలు ఉన్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం స్వాధీనం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుందాల్ సింగ్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రం నుంచి విఠల్‌వాడి తండాకు మద్యం తీసుకెళ్తున్న ఒకరిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై మమత, బిచ్కుంద ఎస్సై అభిషేక్, సిబ్బంది ఉన్నారు.

జాతీయ రహదారిపై జింక మృతి



మద్నూర్: మండల సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందింది. గమనించిన ప్రయాణికులు అధికారులకు సమాచారం అందించారు. వన్యప్రాణులు ఉన్న చోట రోడ్డుపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

నృసింహుడికి భక్తితో..



భీమ్‌గల్: మండల కేంద్రంలోని లింబాద్రి గుట్టపై నిర్వహించిన శ్రీ లక్ష్మీనృసింహుని రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా సాగింది. జయ జయ గోవింద భక్తుల ధ్వానాల మధ్య నంబి వంశస్తులు, వేద పండితులు ఘనంగా రథోత్సవం నిర్వహించారు. రథంపై స్వామి వారిని ఉంచి ఊరేగించారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



రథోత్సవంలో పాల్గొన్న మంత్రి వేముల